క్లుప్తంగా

లారీ - టెంపో ఢీ



ప్రమాదంలో దెబ్బతిన్న ద్విచక్ర వాహనం

మడకశిర: పట్టణంలోని వాల్మీకి సర్కిల్‌లో ఆదివారం ఉదయం రోడ్డు ప్రమాదం జరిగింది. ఓ టెంపో అదుపుతప్పి ఎదురుగా వస్తున్న లారీని ఢీకొంది. అలాగే రోడ్డు పక్కన నిలబెట్టిన ఓ ద్విచక్ర వాహనంపైకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ద్విచక్ర వాహనం నుజ్జు నుజ్జు అయింది. అలాగే మహిళతో పాటు ఇద్దరు పిల్లలు స్వల్పంగా గాయాలపాలయ్యారు. స్థానిక పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అదృష్టవశాత్తూ ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

ఇంటి స్థలాలు క్రమబద్ధీకరించుకోండి

మడకశిర: మడకశిర మున్సిపాలిటీ పరిధిలో అనుమతి లేని లేఔట్లలో కొనుగోలు చేసిన ఇంటి స్థలాలను యజమానులు నామమాత్రపు రుసుం చెల్లించి క్రమబద్ధీకరించుకోవాలని మున్సిపల్ కమిషనర్ జగన్నాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటి స్థలం విలువ ఆధారంగా రుసుం చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఈ ఏడాది జూన్ 30వ తేదీకి ముందు వేసిన లేఔట్లలో యజమానులు తమ ఇంటి స్థలాలను క్రమబద్ధీకరించుకోవాలన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం ప్రత్యేక వెసులుబాటు కల్పించిందని తెలిపారు.

గుండెపోటుతో సూపర్‌వైజర్ మృతి



గిరినాథ్‌రావు (ఫైల్)

రొద్దం: మండల కేంద్రంలోని ప్రాథమి ఆరోగ్య కేంద్రంలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న గిరినాథ్‌రావు(50) శనివారం రాత్రి గుండెపోటుతో మృతి చెందినట్లు వైద్య సిబ్బంది తెలిపారు. డాక్టర్లు, వైద్య సిబ్బంది ఆయన మృతికి సంతాపం తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న రంగనాయకులు

హిందూపురం: పాడి రైతుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ హిందూపురంలో సెప్టెంబర్ 10న ర్యాలీ నిర్వహించనున్నట్లు అఖిల భారత రైతు వ్యవసాయ కూలీ సంఘం జిల్లా కార్యదర్శి రంగనాయకులు అన్నారు. ఆదివారం జిల్లా ఏఐకేఎంఎస్ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ హిందూపురంలోని మూతపడిన ప్రభుత్వ పాలడైరీని పునరుద్ధరించాలని, పాలకు గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. మరోవైపు ప్రభుత్వం మోసపూరితంగా పరిశ్రమలు స్థాపించి ఉద్యోగాలు కల్పిస్తామని మాటలు చెబుతోందని భూములు కోల్పోతున్న రైతులకు మద్దతుగా కార్యక్రమాలపై చర్చించారు.

జీతాలు సక్రమంగా చెల్లించండి



మాట్లాడుతున్న వినోద్‌కుమార్

హిందూపురం టౌన్: గొల్లపల్లి వాటర్ వర్క్స్‌ను ఆప్కాస్‌లో చేర్చి ప్రతి నెలా రెగ్యూలర్‌గా జీతాలు అందించాలని యూనియన్ నాయకులు కోరారు. ఆదివారం కొట్నూరు పంప్‌హౌస్ వద్ద గొల్లపల్లి వాటర్ వర్కర్స్ యూనియన్ సమావేశాన్ని నిర్వహించారు. ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వినోద్ కుమార్ మాట్లాడుతూ కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్ చెల్లించాలన్నారు.

సైన్స్‌పై అవగాహన కల్పించడమే లక్ష్యం



మహాసభలో పాల్గొన్న జనవిజ్ఞానవేదిక నాయకులు

హిందూపురం టౌన్: జిల్లా సమగ్రాభివృద్ధితో పాటు ప్రజల్లో సైన్స్‌పై అవగాహన కల్పించడమే లక్ష్యంగా జన విజ్ఞాన వేదిక లక్ష్యమని జేవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆదిశేషు అన్నారు. ఆదివారం పట్టణంలోని అల్‌హిలాల్ పాఠశాల ఆవరణంలో జన విజ్ఞాన వేదిక జోనల్ మహాసభను నిర్వహించారు. డాక్టర్ ఈటీ రామ్మూర్తి, రైతు సంఘం రాష్ట్ర నాయకులు ధనాపురం వెంకట్రామిరెడ్డి, రచయిత కల్లూరు రాఘవేంద్ర రావు, చైతన్య స్వచ్ఛంద సంస్థ గంగిరెడ్డి పాల్గొని మాట్లాడారు. ప్రజల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడానికి, మూఢనమ్మకాల నిర్మూలనకు కృషి చేస్తున్నామన్నారు.

మొక్కజొన్న సాగుపై ఆసక్తి

- తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి, లాభాలు
- కొద్దిపాటి నీటితోనే సాగు చేసుకోవచ్చంటున్న రైతులు

పెనుకొండ నియోజకవర్గంలో మొక్కజొన్న సాగు ఇలా...

మండలం	ఎకరాల్లో
పెనుకొండ	700
పరిగి	4,380
సోమందేపల్లి	680
రొద్దం	1,800
గోరంట్ల	3,000



పెనుకొండ సమీపంలో కోత దశలో ఉన్న మొక్కజొన్న పంట



నూతనంగా సాగులో ఉన్న మొక్కజొన్న పంట

పెనుకొండ: మొక్కజొన్న సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. తక్కువ పెట్టుబడి, కొద్దిపాటి నీటితో పండే సాగు చేసుకునే అవకాశముండటంతో అధిక ప్రాధాన్యమిస్తున్నారు. ఇతర పంటల కంటే ఎంతో లాభదాయకమని అన్నదాతలు చెబుతున్నారు. వరి సాగుపై రైతులు దృష్టి సారిస్తున్నా సాగు వ్యయం అధికం కావడంతో మొక్కజొన్న సాగుకు మొగ్గుచూపుతున్నారు.

నీటి లభ్యత ఉంటే చాలు..

మొక్కజొన్న పంటకు నీటి లభ్యత ఉంటే చాలు 6, 7 తడుల్లో పంట పూర్తవుతుందని రైతులు చెబుతున్నారు. ఇక వర్షం కురిస్తే 3, 4 తడుల్లోనే పంట చేతికొస్తుందని పేర్కొంటున్నారు. పొలాన్ని దున్ని సాలు చేసి విత్తనం నాటితే ఇక పంట చూస్తున్నట్లే అయిపోతుందని, పెద్దగా కష్ట పడాల్సిన పని లేదంటున్నారు. నెల వ్యవధిలో పంటకు సుడి మందు వేస్తే ఎలాంటి రోగాల బారిన పడకుండా 3 నెలల వ్యవధి లోపలే పంట చేతికొచ్చి రైతులకు ప్రయోజనం చేకూరుతుందని చెబుతున్నారు.

రూ. 2,200 పైనే ధర ..

మార్కెట్లో మొక్కజొన్నకు నిరంతరం క్వింటాకు రూ. 2200 పైనే ధర నిలకడగా ఉంటోంది. కోళ్ల దానాకు ఇతర వినియోగాలకు మొక్కజొన్న విత్తనం ఉపయోగకరంగా ఉండటంతో ధరలో ఎలాంటి మార్పు ఉండటం లేదు. ఈ నేపథ్యంలో రైతు పెట్టుబడి పోను 40 నుంచి 50 శాతం లాభాలు వస్తుండటంతో రైతులు మొక్కజొన్న సాగుకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు. ఇప్పటి వరకు మొక్కజొన్న సాగు చేసి నష్టపోయిన రైతులు ఎవరూ లేరని చెబుతున్నారు.

మొక్కజొన్న లాభదాయకం



మొక్కజొన్న పంట ఎంతో లాభదాయకమైనది. ఎన్ని క్లిష్ట పరిస్థితులు ఉన్నా పంట చక్కగా వచ్చి సగానికి సగం లాభాలు అందిస్తుంది. ప్రస్తుతం 3.5 ఎకరాల్లో పంట సాగుకు సిద్ధం చేశాను. మొక్కజొన్న లేకుంటే రైతులు ఆర్థికంగా ఇబ్బందులు పడటం ఖాయం.

– ఫరీద్, పెనుకొండ

అనుకూలమైన పంట



మొక్కజొన్న పంట ఎంతో అనుకూలమైనది. వాతావరణంతో సంబంధం లేకుండా రైతులకు చేతికి వచ్చే పంట కూడా ఇదే. గతంలో ఇతర పంటలు సాగు చేసి నష్టపోయే వాళ్లం. అయితే మొక్కజొన్నతో నష్టాలు వచ్చే పరిస్థితి లేకపోవడంతో దాన్ని సాగు చేస్తున్నాం.

– వెంకటరాముడు, మునిమడుగు, పెనుకొండ మండలం

సులువుగా పంట చేతికి...

మొక్కజొన్న సాగు చేస్తున్న రైతులకు వ్యవసాయశాఖ తరఫున సూచనలు, సలహాలు ఇస్తున్నాం. మొక్కజొన్నకు మార్కెట్లో కూడా మంచి డిమాండ్ ఉంది. సులువుగా మొక్కజొన్న పంట చేతికి వస్తుండటంతో ఎక్కువ మంది రైతులు ఈ పంట వేసుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు.

– చందన, ఏఓ, పెనుకొండ

6న జేడీఎస్ ఆందోళన

పావగడ: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజా వ్యతిరేక పాలనను వ్యతిరేకిస్తూ జేడీఎస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం తాలూకా కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టనున్నట్లు జేడీఎస్ పార్టీ తాలూకా అధ్యక్షుడు ఎన్ఏ ఈరణ్ణ ఓ ప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని విమర్శించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో ఆందోళనలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

చలో విజయవాడకు తరలిరండి

పెనుకొండ: సర్పంచ్‌ల సమైక్య శంఖారావం చలో విజయవాడ కార్యక్రమం ఈ నెల 5న నిర్వహిస్తున్నామని, కార్యక్రమానికి సర్పంచులు పెద్ద ఎత్తున తరలిరావాలని పెనుకొండ మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు నాగరాజు పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం 7 నెలల క్రితం విడుదల చేసిన 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. 111 కోట్లు తక్షణం గ్రామ పంచాయతీలకు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సర్పంచుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ చలో విజయవాడ కార్యక్రమం చేపట్టినట్లు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ స్పందించాలన్నారు. తమ సమస్యలను పరిష్కరించని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు

పుట్టపర్తి టౌన్: మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని పోలీసులు వాహనదారులను హెచ్చరించారు. ఎస్పీ రత్న ఆదేశాల మేరకు పోలీసులు జిల్లా వ్యాప్తంగా ముమ్మరంగా వాహనాల తనిఖీ చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ చట్టవ్యతిరేక కార్యకలాపాలను అరికట్టేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు.

జగన్ 2.0లో కార్యకర్తలకే ప్రాధాన్యం

- చంద్రబాబు మోసాలను ఇంటింటా వివరించండి
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్, మడకశిర సమన్వయకర్త ఈరలక్కప్ప



అమరాపురం: మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్



చెందకచెర్లులో క్యూఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఈరలక్కప్ప, వైఎస్సార్‌సీపీ నాయకులు

అమరాపురం: టీడీపీ, బీజేపీ, జనసేన అన్ని పార్టీలు కలసి వచ్చినా 2029లో ముఖ్యమంత్రి అయ్యేది వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్, మడకశిర వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని హలుకూరులో బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమం మండల కన్వీనర్ త్రిలోక్‌నాథ్, రాష్ట్ర బీసీ విభాగం అధ్యక్షుడు హలుకూరు కాంతరాజు ఆధ్వర్యంలో జరిగింది. ఉషశ్రీచరణ్, ఈరలక్కప్ప, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ యాక్టివిటీ కార్యదర్శి వజ్ర భాస్కర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ రెడ్డి, రాష్ట్ర బీసీ విభాగం ఉపాధ్యక్షుడు కాంతరాజు మాట్లాడుతూ వైఎస్ జగన్ 2.0లో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు అధిక ప్రాధాన్యత ఇస్తారన్నారు. కార్యకర్తలు అధైర్య పడకుండా జగనన్న కోసం సైనికుల్లా గ్రామాల్లో పని చేయాలన్నారు. గతంలో పవన్‌కళ్యాణ్ రాష్ట్రంలో 30 వేల మంది మహిళలు కనబడటం లేదని చెప్పారని, ప్రస్తుతం పవన్ ఎక్కడున్నారో చెప్పాలన్నారు.

పోలీసులు పక్షపాత ధోరణి వీడండి

అమరాపురం మండలంలో పని చేస్తున్న పోలీసులు తమ విధులను సక్రమంగా నిర్వర్తించాలని ఏకపక్ష ధోరణిని వీడాలని మాజీ మంత్రి వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్, సమన్వయకర్త ఈరలక్కప్ప పేర్కొన్నారు. గత వారంలో జరిగిన సింగిల్ విండో అధ్యక్షుడి ప్రమాణ స్వీకారానికి డీజే అనుమతిచ్చి, ప్రస్తుతం రెండు గంటల సమావేశానికి డీజే తీసుకొస్తే స్టేషన్‌కు తీసుకెళ్తారా అని ప్రశ్నించారు. జిల్లాలో ఎక్కడా లేని రూల్స్ కేవలం అమరాపురం మండలంలోనే జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి చౌళూరు మధుమతిరెడ్డి, రాష్ట్ర యువత విభాగం అధ్యక్షుడు లింగారెడ్డి, జెడ్పీటీసీలు అనంతరాజు, భూతరాజు, ఎంపీపీ ఈరన్న, వైస్.ఎంపీపీలు రంజిత్‌కుమార్, కృష్ణమూర్తి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నరసింహమూర్తి, నియోజవర్గం ఎస్సీ, బీసీ సెల్ అధ్యక్షులు శినన్న, శివకుమార్, మాజీ కార్పొరేషన్ డైరెక్టర్లు ఈరక్యాతరాయప్ప, గగన, తదితరులు పాల్గొన్నారు.

మడకశిర: కూటమి ప్రభుత్వ మోసాలను వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఇంటింటికీ వెళ్లి వివరించాలని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప పిలుపునిచ్చారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. ఆదివారం పట్టణంలోని 1, 2, 3, 8వ వార్డుల పరిధిలో పట్టణ కన్వీనర్ వాల్మీకి సతీష్‌కుమార్ అధ్యక్షతన 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ' కార్యక్రమంలో ఆయనతో పాటు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి (యాక్టివిటీ) వజ్ర భాస్కర్‌రెడ్డి, పట్టణ ఇన్‌చార్జ్ భారతీరెడ్డి దేశాయి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు క్యూ ఆర్‌కోడ్‌ను స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి విడుదల చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శులు గోవర్ధన్‌రెడ్డి, రవిశేఖర్‌రెడ్డి, కుంచిటి వక్కలిగ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు రంగేగౌడ్, మాజీ మున్సిపల్ చైర్మన్ జయరాజ్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రామచంద్రారెడ్డి, బీసీ సెల్ జిల్లా కార్యదర్శి శ్రీరాములు, బూత్ కమిటీ విభాగం అధ్యక్షుడు మల్లికార్జున, బీసీ సెల్ కార్యదర్శి సత్యనారాయణ, పట్టణ వైఎస్సార్‌సీపీ కమిటీల సభ్యులు గోపి, అంజలి, మధుసూదన్, ఫణియాదవ్, కోఆప్షన్ సభ్యుడు ఫకృద్దీన్, వెంకటేశ్, నవీన్, ధను, నగేష్, సైపుల్లా తదితరులు పాల్గొన్నారు.

మడకశిరరూరల్: మండల పరిధిలోని చెందకచెర్లు, గౌడనహళ్లి పంచాయతీ కేంద్రాల్లో ఆదివారం మండల కన్వీనర్ రామిరెడ్డి, సర్పంచ్ పుట్టమ్మ, పంచాయతీ ఇన్‌చార్జ్‌ల అధ్యక్షతన 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప మాట్లాడుతూ కూటమి ప్రభుత్వాన్ని హామీల అమలుపై ప్రశ్నిస్తే రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తూ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్ర ఆర్గనైజేషన్ యాక్టివిటీ కార్యదర్శి, పీఏసీ సభ్యులు వజ్ర భాస్కర్‌రెడ్డి , రాష్ట్ర మహిళా విభాగం జనరల్ సెక్రటరీ, రాష్ట్ర కార్యదర్శి చౌళూరు మధుమతి రెడ్డి, మాజీ ఎమ్మెల్యే వైటీ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామ కమిటీలను పారదర్శకంగా ఏర్పాటు చేసుకుని గ్రామస్థాయిలో వైఎస్సార్‌సీపీ బలోపేతమే లక్ష్యంగా కమిటీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పని చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పుట్టమ్మ, మండల కన్వీనర్ రామిరెడ్డి, రాష్ట్ర కుంచిటి వక్కలిగ విభాగం అధ్యక్షుడు రంగేగౌడ్, రాష్ట్ర కార్యదర్శి వైసీ గోవర్ధన్‌రెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రవిశేఖర్‌రెడ్డి, రాష్ట్ర వైఎస్సార్ మహిళా విభాగం జాయింట్ సెక్రటరీ భారతీరెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నరసింహమూర్తి, జిల్లా అధికార ప్రతినిధి ఆనందరంగారెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ హనుమంతు, రాష్ట్ర బీసీసెల్ కార్యదర్శి సత్యనారాయణ యాదవ్, ఎంపీపీ కవిత, వక్కలిగ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ నాగరాజ్‌గౌడ్, మాజీ సర్పంచ్ శ్రీరాములు, ఎంపీటీసీ సభ్యులు బాగ్యాబాయి, ఆదిలక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి విశ్రాంత ఉపాధ్యాయుడు



సమావేశానికి హాజరైన కార్యకర్తలు

అమరాపురం: మండల పరిధిలోని ఆలదపల్లికి చెందిన టీడీపీ సానుభూతిపరుడు, విశ్రాంత ఉపాధ్యాయుడు క్రిష్ణమూర్తి ఆదివారం హలుకూరులో జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలోకి చేరారు. ఈ సందర్భంగా పార్టీ కండువా వేసి సాదారంగా ఆహ్వానించారు. అలాగే డాక్టర్ మనోహర్ పార్టీలోకి చేరారు.

కూటమి ప్రభుత్వాన్ని నిలదీద్దాం

గుడిబండ: సూపర్ సిక్స్ పథకాలతో రాష్ట్ర ప్రజలను మోసం చేసి గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వ మోసాన్ని నిలదీద్దామని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ యంజారేగౌడు అన్నారు. మండల పరిధిలోని మోరబాగల్, గుణేమోరుబాగల్ గ్రామాల్లో ఆదివారం 'బాబు ష్యూరిటీ– మోసం గ్యారంటీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యవజన అధికార ప్రతినిధి లింగారెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు కాడసిద్ధేశ్వర, మాజీ సర్పంచ్ నాగరాజుగుప్తా, నాయకులు రంగనాథ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మోసానికి నిలువెత్తు నిదర్శనం చంద్రబాబు



బీచిగానిపల్లిలో రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్

పెనుకొండ: 'మోసానికి నిలువెత్తు నిదర్శనం ముఖ్యమంత్రి చంద్రబాబు.. ఎన్నికల సమయంలో ఆయన ప్రజలకు ఇచ్చిన హామీలు అమలుచేయడంలో విఫలమయ్యారు' అని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ విమర్శించారు. పట్టణంలోని దర్గా సర్కిల్లో బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఆదివారం పార్టీ నాయకులతో కలసి మోసం గ్యారెంటీ క్యూఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరించారు. మాజీ మంత్రి ఉషశ్రీచరణ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి 14 నెలలు పూర్తయినా ఏ ఒక్క హామీ కూడా అమలు చేయడం లేదన్నారు. కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత వ్యక్తమవుతోందని, చంద్రబాబు పాలనపై ప్రజలు విసిగిపోయి ఉన్నారన్నారు. 40 ఏళ్ల రాజకీయ అనుభవం అంటున్న ముఖ్యమంత్రి చంద్రబాబు అబద్ధాలతో కాలం వెళ్లదీయాలనుకోవడం సిగ్గుచేటన్నారు. పార్టీ బలోపేతానికి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు కృషిచేయాలన్నారు. వైఎస్సార్‌సీపీ టౌన్ కన్వీనర్లు బోయ నరసింహా, సుధాకరరెడ్డి, మాజీ కన్వీనర్ శ్రీకాంత్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ సునీల్, కౌన్సిలర్లు శేషాద్రి, సద్దాం, తయూబ్, నాయకులు జయశంకరరెడ్డి, నాగలూరు బాబు, రేపటి గణేష్, బోయ బాబు, శ్రీరాములు, యాసిన్, ఇర్షాద్, ఖాజాపీర్, చెన్నకేశవ, గుట్టూరు నారాయణస్వామి, మాజీ సింగిల్‌విండో అధ్యక్షుడు సూర్యప్రకాష్‌రెడ్డి, కృష్ణారెడ్డి, గోపాలరెడ్డి, నారాయణ, అంజనరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పెనుకొండలో క్యూఆర్‌కోడ్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఉషశ్రీచరణ్, నాయకులు

పరిగి: గత పద్నాలుగేళ్లుగా చంద్రబాబు మోసాలను రాష్ట్ర ప్రజలందరూ చూశారని, ఇప్పుడు ఆయనేం చేసినా ప్రజలు నమ్మరని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ అన్నారు. మండలంలోని బీచిగానిపల్లిలో ఆదివారం రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమంలో భాగంగా 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' కార్యాక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం వైఫల్యాలు ఎండగట్టడమే కాకుండా అర్హులైన సంక్షేమ లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాల అమలులో జరిగిన అన్యాయాన్ని, అక్రమాలను ఎండగట్టారు. అనంతరం బాబు ష్యూరిటీ .. మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ నరసింహమూర్తి, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు 'బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ'

మడకశిర: పట్టణంలోని 7, 9, 10, 11, 12వ వార్డుల పరిధిలో సోమవారం బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు పట్టణ కన్వీనర్ వాల్మీకి సతీష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు వేంకటరమణస్వామి ఆలయం వద్ద కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ని పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

మడకశిరరూరల్: మండల పరిధిలోని మెళవాయి, కదిరేపల్లి పంచాయతీల్లో బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి ఆనందరంగారెడ్డి, సర్పంచ్ నర్సేగౌడ్, ఇన్‌చార్జ్ తిమ్మప్ప తెలిపారు. ఉదయం 9 గంటలకు మెళవాయి, మధ్యాహ్నం కదిరేపల్లి కార్యక్రమం ఉంటుందన్నారు. పార్టీ శ్రేణులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

ప్రైవేటు స్కూళ్లకు దోచిపెట్టేందుకే జీఓలు



ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వులను దహనం చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

హిందూపురం టౌన్: విద్యార్థుల హక్కులను హరించేలా పాఠశాలల్లో విద్యార్థి సంఘాలు, ఇతర రాజకీయ పార్టీల నాయకులు ప్రవేశించకుండా నిషేధిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులను విడుదల చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నరసింహమూర్తి అన్నారు. ఆదివారం పట్టణంలోని అంబేడ్కర్ కూడలిలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. సర్కిల్‌లో ప్రభుత్వ జీఓ ఉత్తర్వులను దహనం చేశారు. ఈ సందర్భంగా నరసింహమూర్తి మాట్లాడుతూ విద్యార్థి సంఘాలు రాజకీయాల కోసం కాదని, విద్యార్థుల సమస్యల పరిష్కారానికి, హక్కుల కాపాడేందుకు, విద్యారంగంలో ఉన్న అన్యాయాలపై పోరాటాలు నిర్వహించడం కోసమేనన్నారు. ఈ పద్ధతిలో విద్యార్థి సంఘాలపై నిషేధం విధించడం ప్రజాస్వామ్యాన్ని అణగదొక్కే చర్యేనని మండిపడ్డారు. ప్రధానంగా కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలలన్నీ కూటమి ప్రభుత్వ నాయకులవేనని, శ్రీచైతన్య, నారాయణ, భాష్యం ఈ పాఠశాలలు ఫీజుల దోపిడీని, పుస్తకాలను అధిక ధరలకు అమ్ముకోవడానికి, విద్యను వ్యాపారం చేసుకోవడానికి, వారి మేలుకోసమే ఉత్తర్వులు ఇచ్చారన్నారు. వెంటనే జీవోలను వెనక్కితీసుకోకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు చంద్రశేఖర్, మహమ్మద్ అలీ, వినీత్, ఖలంధర్, ప్రభాకర్, దీపక్, కార్తీక్, వర్ధన్, సిద్ధార్థ, వంశీ తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

గుడిబండ: మండల పరిధిలోని ఫళారం లోని ఎస్సీ కాలనీకి చెందిన హనుమక్క అక్రమంగా కర్ణాటక మద్యం తీసుకువచ్చి విక్రయిస్తుండగా ఆదివారం అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ రాజకుళ్లాయప్ప తెలిపారు. ఆమె వద్ద నుంచి రాజా విస్కి 50 ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.